**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ 26-08-2026** **సమయం 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.
2. జపాన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి కోరారు.
3. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పవిత్రమైన మిలాద్-ఉన్-నబీని రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకుంటున్నారు.
4. రాష్ట్రంలో నేడు, రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

........................................................

**ఖమ్మం-తుమ్మల**

విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 24 కోట్ల రూపాయలతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాహితం కోసం విద్య, వైద్యం పై పెట్టే ఖర్చు, భవిష్యత్తు పెట్టుబడి అన్నారు. జిల్లాకు మరో 200 పడకల ఆసుపత్రిని కూడా మంజూరు చేయిస్తానని తెలిపారు.

....పీటీసీ- ఖమ్మం

**జపాన్-మంత్రి వివేక్**

జపాన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి కోరారు. జపాన్ పర్యటనలో ఉన్న మంత్రి ఒసాకాలో జరిగిన 'ఇండియా–జపాన్ వర్క్ ఫోర్స్ రౌండ్‌టేబుల్' సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని, జపాన్ సంస్థలు సురక్షితంగా, లాభదాయకంగా వ్యాపారాలు నిర్వహించుకునేలా పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో సుమారు 600 ఎకరాల్లో జపాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కొన్ని సంస్థలు ఆసక్తి చూపడాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు.

.....డెస్క్

**మిలాద్ ఉన్ నబీ**

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పవిత్రమైన మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు ఘనంగా జరుపుకుంటున్నారు. ఆయా జిల్లా, పట్టణ కేంద్రాల్లో మైనార్టీలు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ పర్వదినం శాంతి, సామరస్యం, సమైక్యతను మరింత బలపరచాలని గవర్నర్ తన సందేశంలో పేర్కొన్నారు. ప్రవక్త జీవితం నుంచి స్ఫూర్తి పొందుతూ, అందరూ పరస్పర సామరస్యంతో మెలుగుతూ దేశ పురోగతికి కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు, కాగజ్ నగర్ పట్టణం సిర్పూర్ (టి), జైనూర్ మండల కేంద్రాలలో మైనార్టీలు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో నడుస్తూ సేవ తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు మండల కేంద్రాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు పలు కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. .....డెస్క్, పీటీసీ -ఆసిఫాబాద్/సిరిసిల్ల

**హరీశ్-22ఏ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేసిన తప్పులకు సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. ప్రజా ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టి, ప్రభుత్వమే ప్రజల ఆస్తుల పాలిట కబ్జాదారుగా మారిందని ఆరోపించారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో 22ఏ నిషేధిత భూముల జాబితా బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో 30 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయించిందని అన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలకు కూడా లేకుండా భూములు విక్రయిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ప్రజల భూములను కూడా  నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందిపెడుతోందని ఆరోపించారు.

.....డెస్క్

**ఎరువులు-తుమ్మల**

ఎరువుల ధరల్లో ఉన్న భారీ వ్యత్యాసం కారణంగా రైతులు తక్కువ ధరకు లభించే యూరియాను మోతాదుకు మించి వినియోగిస్తున్నారని, దీనివల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పంటల నాణ్యత తగ్గి అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ పడిపోతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అదుపు చేయడానికి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తక్షణమే రేషనలైజ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

.....డెస్క్

**మేడ్చల్ –ఎరువులు సౌండ్ బైట్**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రయోగాత్మకంగా కేంద్ర ప్రభుత్వ 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్' విధానాన్ని తెలంగాణలోని 22 జిల్లాలకు విస్తరించారు. ఈ యాప్ పనితీరు, ప్రయోజనాలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎరువుల విభాగం నోడల్ అధికారి, బాలానగర్ మండల వ్యవసాయ అధికారి సాయి రమేష్ వివరించారు.

**సౌండ్ బైట్ మండల వ్యవసాయ అధికారి సాయి రమేష్......**

.....పీటీసీ- మేడ్చల్

**కొత్తగూడెం-ఎస్టీ కమిషన్**

జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో షెడ్యూల్ తెగల ఫిర్యాదులు, కేసులపై సమగ్ర విచారణ చేపట్టారు. మొత్తం 40 కేసులను విచారణకు స్వీకరించి, వాటికి సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించారు.

......పీటీసీ- భద్రాద్రి కొత్తగూడెం

**రామగుండం-సీపీ**

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు పరీక్ష వరకు ప్రతి రోజును కౌంట్‌డౌన్‌గా భావించి సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఏర్పాటు చేసిన ''నిపుణ'' ఉచిత శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

**సౌండ్ బైట్ అంబర్ కిషోర్ ఝా.....**

......పీటీసీ - మంచిర్యాల జిల్లా

**మేడ్చల్-అక్రమ నిర్మాణాలు**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి జోన్‌లో రెండు, కుత్బుల్లాపూర్ జోన్‌లో ఎనిమిది చొప్పున మొత్తం పది అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

.....పీటీసీ-మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా

**సిరిసిల్ల-ఆదిశ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు సమర్పిస్తున్న కోడెలు, ఆవుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ తిప్పాపూర్ రాజ రాజేశ్వర స్వామి గోశాలలో నిన్న ఐదు కోడెలు మృతిచెందడంతో ఈరోజు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డితో కలిసి గోశాలను సందర్శించారు.

....పీటీసీ- సిరిసిల్ల

**సంగారెడ్డి-రుణాలు**

సంగారెడ్డి జిల్లాలో వివిధ రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను వంద శాతం సాధించేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. కలెక్టరేట్ లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు.

....పిటిసి- సంగారెడ్డి

**ఆసిఫాబాద్ -చేయూత**

ఆసిఫాబాద్ జిల్లాలో అర్హులైన చేయూత పెన్షన్ లబ్ధిదారులు ఈ నెల 31 లోపు ఆయా ఎంపీడీవో లేదా మున్సిపాలిటీ కార్యాలయాల్లో తమ దరఖాస్తు ఫారాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ కే.హరిత ప్రకటనలో పేర్కొన్నారు.

.....పిటిసి- ఆసిఫాబాద్ జిల్లా

**కామారెడ్డి-సర్**

కామారెడ్డి జిల్లా ప్రజలు ఓటరు జాబితాను పరిశీలించి తమ అభ్యంతరాలు, సూచనలను తెలపాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-SIRలో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల్లో రేపు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు

....పిటిసి - కామారెడ్డి

**హనుమకొండ-సర్**

హనుమకొండ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సుమారు ఒక లక్షా 32 వేల 70 మందికి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం ఫారం-8 ద్వారా, కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

.....పిటిసి- వరంగల్

**వాతావరణం**

రాష్ట్రంలో నేడు, రేపు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

....డెస్క్

**సూర్యాపేట ప్రమాదం**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట వద్ద ఈ తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందగా మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ నుంచి 40మంది ప్రయాణికులతో విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు ఉన్న కంటైనర్ లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో 20 మంది వరకు గాయపడ్డారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను స్థానికుల సాయంతో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

.....పీటీసీ - నల్లగొండ